సాక్షి జగిత్యాల
ఆదివారం | 1 | జనవరి | 2023


జగిత్యాల్లో నూతన సంవత్సర వేడుకలు




రాయికల్‌లో నూతన సంవత్సర వేడుకల
కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్


రాయికల్ ఠాణాలో చిన్నారుల వేడుకలు


రాయికల్ పట్టణంలో మహిళల వేడుకలు



కాలగమనంలో మరో వసంతం కలిసిపోయింది. కొందరికి సంతోషాలను పంచుతూ.. మరికొందరికి దుఃఖాన్ని మిగిల్చుతూ జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు 2022 ఏడాదికి వీడ్కోలు చెబుతూ.. 2023 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి 12 గంటలు కొట్టగానే బాణాసంచా వెలుగులో.. టపాసుల మోతలతో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. డీజే మోతలు.. బ్యాండుమేళాలతో ఆడిపాడారు.

న్యూస్‌రీల్

వైభవంగా తిరుప్పావై సేవ


శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కోరుట్ల: పట్టణంలోని అతిపురాతన శ్రీవేంకటేశ్వర ఆలయంలో శనివారం అన్న కూటోత్సవం (తిరుప్పావై సేవ) వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరు పేపర్ల విధానం భేష్


మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 11కు బదులు ఆరు పేపర్ల పరీక్ష నిర్వహించడం అభినందనీయమని, అయితే, రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కోవిడ్ మహమ్మారి ప్రభావంతో రెండేళ్లపాటు భౌతికంగా తరగతులు జరగలేదని, విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు సరిగా వినలేకపోయారని చెప్పారు. ఈ క్రమంలో పూర్తి సిలబస్‌పై పట్టు సాధించడం కష్టతరమని పేర్కొన్నారు. ఉన్నత విద్య పరీక్ష పేపర్లలో అన్నివిభాగాల్లో చాయిస్‌లు ఇస్తున్నారని, పదో తరగతి పరీక్షల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ పాల్గొన్నారు.

రూ.104 కోట్ల 'రైతుబంధు' జమ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని 1.72లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డిసెంబర్ 31 నాటికి రూ.104.25 కోట్ల రైతుబంధు సొమ్ము జమ అయిందని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ శనివారం తెలిపారు. మిగతా వారికి క్రమపద్ధతిన ఎకరాల వారీగా నిధులు జమ కానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామి

- కొత్త ఏడాదిలోనూ ప్రగతి పరుగులు
- విధి నిర్వహణ సంతృప్తినిచ్చింది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ రవి

జగిత్యాల: జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ, అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని కలెక్టర్ రవి అన్నారు. కలెక్టర్‌గా బాధ్యతల నిర్వహణ ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. 2022కు వీడ్కోలు చెబుతూ, 2023కు స్వాగతం చెబుతూ 'సాక్షి' కలెక్టర్‌తో ఇంటర్వ్యూ నిర్వహించింది. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి : కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి దాదాపు రెండేళ్లు పూర్తిచేసుకున్నారు. 2023లోకి అడుగుపెడుతున్నారు. ఎలా ఉంది?

కలెక్టర్ : కలెక్టర్‌గా జిల్లా ప్రజలకు సేవలు అందించడం ఎంతో సంతృప్తినిచ్చింది. 2023లో పక్కా ప్రణాళికతో మరింత అభివృద్ధి చేస్తాం.

సాక్షి : మీ హయాంలోనే కొత్త కలెక్టరేట్ ప్రారంభమైంది. ఎలా ఉంది?

కలెక్టర్ : ఇది నాకెంతో సంతృప్తినిచ్చింది. సీఎం కేసీఆర్ ప్రారంభించడం ప్రత్యేకంగా ఉంది.

సాక్షి : వైద్యరంగంలో మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : పేదలకు మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రతీఆస్పత్రిలో ఆధునిక వసతులు కల్పించాం. గర్భిణుల కోసం మాతా శిశు సంక్షేమ కేంద్రం ప్రారంభించాం. టిఫా స్కానింగ్, మౌళిక వసతులు ఉన్నాయి.

సాక్షి : రైతుల అభివృద్ధి, సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్ : జగిత్యాల వ్యవసాయాధారిత జిల్లా. వరి ఎక్కువగా సాగవుతుంది. అత్యధికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తున్నాం.

సాక్షి : మున్సిపాలిటీ అభివృద్ధికి తీసుకునే చర్యలు ఏమిటి?

కలెక్టర్ : ప్రతినెలా మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి ద్వారా నిధులు మంజూరవుతున్నాయి. వాటిని వెచ్చించి సెంట్రల్ లైటింగ్, జంక్షన్లు, సుందరీకరణ పనులు చేపడుతున్నాం.

సాక్షి : ఆలయాలను ఎలా అభివృద్ధి చేస్తున్నారు?

కలెక్టర్ : కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. ముఖ్యంగా కొండగట్టుకు రూ.100 కోట్లు ప్రకటించగా ప్రతిపాదనలు రూపొందించాం. త్వరలోనే పనులు ప్రారంభమయవుతాయి.

సాక్షి : విద్యారంగం అభివృద్ధికి ఏం చేస్తారు?

కలెక్టర్ : విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు మన ఊరు.. మన బడి ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాం. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తున్నాం. పరీక్షల సమయంలో ప్రత్యేక నిధులతో అల్పాహారం అందిస్తున్నాం.

సాక్షి : నిరుద్యోగుల కోసం ఏం చేస్తున్నారు?

కలెక్టర్ : జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ స్టడీ సెంటర్లు ప్రారంభించాం. ఇప్పటికే రెండు బ్యాచ్‌ల్లో యువత తర్ఫీదు పొందింది. హైదరాబాద్‌లో కూడా లేని వసతులు ఇక్కడ అందుబాటులోకి తెచ్చాం. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

సాక్షి : ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు?

కలెక్టర్ : ధరణిలో రైతులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన ఆప్షన్లతో ముందుకు వెళ్తున్నాం.



సాక్షి : ప్రజా సమస్యలు ఎలా పరిష్కరిస్తున్నారు?

కలెక్టర్ : ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహించి, బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా సత్వరమే పరిష్కరిస్తున్నాం.

సాక్షి : కొత్త సంవత్సరం ఎలా ఉండాలనుకుంటున్నారు..?

కలెక్టర్ : కొత్త సంవత్సరం–2023లో జిల్లావాసులు అందరికీ శుభాలు జరగాలి. ఇదేసమయంలో జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేయాలి. ఇప్పటికే వైద్య కళాశాల తరగతులు ప్రారంభించాం. కొత్త కలెక్టరేట్‌లో 54 ప్రభుత్వ శాఖల సేవలు ప్రారంభించాం. ధర్మపురి నియోజకవర్గంలో 97 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమ పనులు కొత్త ఏడాదిలోనే ప్రారంభమవుతాయి. సుమారు 30 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది.

'కొత్త'గా మాస్టర్ ప్లాన్ అమలు

జగిత్యాల: బల్దియాలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు కొత్త ఏడాదిని ఎంచుకున్నామని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ బోనగిరి నరేశ్ తెలిపారు. నూతన సంవత్సరం 2023 సందర్భంగా ఆయనతో నిర్వహించిన ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే..



సాక్షి : 1983 నాటి మాస్టర్‌ప్లాన్ అమలులో అవరోధాలు ఉన్నాయా?

కమిషనర్ : చాలా ఉన్నాయి. కానీ, కొత్త జీవో జారీకావడంతో పబ్లిక్ నోటిఫికేషన్ జారీచేసి కొత్త సంవత్సరంలో పకడ్బందీగా అమలు చేస్తాం.

సాక్షి : సుందరీకరణ పనులు ఎలా సాగుతున్నాయి?

కమిషనర్ : కొత్తబస్టాండ్, పాతబస్టాండ్‌లో సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే కొత్త జంక్షన్లు ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం రూ.10 కోట్లు మంజూరయ్యాయి.

సాక్షి : హరితహారంపై ఎలాంటి దృష్టి పెట్టారు?

కమిషనర్ : హరితహారం ద్వారా పట్టణంలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందిస్తున్నాం. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ట్రీపార్క్‌లు ఏర్పాటు చేశాం.

సాక్షి : తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఫలితాలు ఎలా ఉన్నాయి?

కమిషనర్ : క్రీడా ప్రాంగణాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కొత్తగా మరో ఐదు క్రీడా ప్రాంగణాలు మంజూరయ్యాయి.

సాక్షి : ఆస్తిపన్ను వసూలు ఎందుకు వందశాతం నమోదు కావడంలేదు?

కమిషనర్ : ఈ ఏడాదిలో తప్పకుండా వందశాతం ఆస్తిపన్ను వసూలు చేస్తాం.

సాక్షి : అనుమతిలేని వ్యాపారాలతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది?

కమిషనర్ : రోడ్డు సామర్థ్యాన్ని బట్టి అనుమతిలేని వ్యాపారులు కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా ఇప్పటికే నోటీసులు జారీచేశాం.

సాక్షి : పారిశుధ్యం లోపిస్తుందనే విమర్శలు ఉన్నాయి?

కమిషనర్ : అలాంటిదేమీలేదు. రోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ఏమైనా సమస్యలు ఉంటే మాకు ఫిర్యాదు చేయండి. పరిష్కరిస్తాం.

సాక్షి : విలువైన స్థలాలు కబ్జా చేస్తున్నారు?

కమిషనర్ : ఇలాంటి స్థలాలను గుర్తించాం. ఆక్రమణదారులకు నోటీసులు జారీచేస్తున్నాం. మున్సిపల్, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం నేరం.

అక్రమ వ్యాపారాలపై కఠిన చర్యలు

- జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాశ్

జగిత్యాలక్రైం: అక్రమ ఫైనాన్స్‌లు, అధిక వడ్డీల వ్యాపారం నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రకాశ్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో అక్రమ ఫైనాన్స్‌లు, అధిక వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహించామని, ఈసందర్భంగా 9 మందిలపై కేసులు నమోదు చేశామని, వారినుంచి రూ.6,07,100 నగదు, 2 తులాల బంగారం, 300 ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు, ఫైనాన్స్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. శుక్రవారం రాత్రి జరిగిన దాడుల్లో జిల్లా కేంద్రానికి చెందిన నీలగిరి ఉమారాణి, ఎనగందుల మధుకర్, ఎనగందుల విజయ్, ఎన్నం ప్రభాకర్, బొడ్డుల రమేశ్, సోమారపు రమేశ్, సురభి ఫైనాన్స్, అరవింద్ ఆటోఫైనాన్స్, శ్రీపాద వెంకటచారిపై కేసు నమోదు చేశామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణకుమార్, ధర్మపరి సీఐ కోటేశ్, ఎస్సైలు సంజీవ్, అనిల్, రమేశ్, రహీం పాల్గొన్నారు.

ముక్కోటి వేడుకలు విజయవంతం చేయాలి

- శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్


పనులు పరిశీలిస్తున్న అధికారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 2న నిర్వహించనున్న ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలను విజయవంతం చేయాలని దేవస్థానం ఈవో శ్రీనివాస్ కోరారు. వేడుకల విజయవంతం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెనోవేషన్ కమిటీ సభ్యుల సమక్షంలో మున్సిపల్, పోలీస్, విద్యుత్, శానిటేషన్ అధికారులతో శనివారం పట్టణంలో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ.. వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వేడుకలకు హాజరవుతారని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. పోలీస్ బందోబస్తు, నిరంతర విద్యుత్, శానిటేషన్ తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అధికారులు, పాలకవర్గం సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలన్నారు. రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్, ట్రాన్స్‌కో ఏఈ మనోహర్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం



జగిత్యాల: భౌగోళిక, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో మాధురి సూచించారు. ఈ మేరకు శనివారం ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కారోబార్ కుటుంబాన్ని ఆదుకోవాలి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): మండలంలోని దూలూర్ గ్రామపంచాయతీ కారోబార్ వంగరి లింగేశ్వర్ ఆకస్మికంగా మృతిచెందారని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. గ్రామపంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తుందనే ఆశతో తక్కువ వేతనంతో పని చేస్తున్నారన్నారు. లింగేశ్వర్ మృతితో అతడి కుటుంబ పరిస్థితి దీనంగా మారిందన్నారు. ప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సయ్య, నాయకులు మేడిపెల్లి గంగాధర్, నరెడ్ల రవీందర్‌రెడ్డి, నల్లూరి కిషన్, వంగరి శశి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలుపై దృష్టి


కెపాసిటర్ బ్యాంక్ ప్రారంభిస్తున్న అధికారులు

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని ట్రాన్స్‌కో జగిత్యాల ఏడీఈ రాజబ్రహ్మాచారి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ట్రాన్స్‌కో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని గ్రామపంచాయతీల విద్యుత్ బకాయిలపై అధికారులతో చర్చించారు. గ్రామపంచాయతీల విద్యుత్ బకాయిలు రూ.10 లక్షలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్ పాల్గొన్నారు.

కెపాసిటర్ బ్యాంకు ప్రారంభం

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కెపాసిటర్ బ్యాంక్‌ను ట్రాన్స్‌కో ఎస్‌ఈ సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. సబ్‌స్టేషన్ పరిధిలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో 1ఎంవీఏఆర్ సామర్థ్యంగల కెపాసిటర్ బ్యాంక్ బిగించి ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏడీఈలు రఘుపతి, రాజబ్రహ్మాచారి, ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్ ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు, సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామంలో రౌరూపుల లక్ష్మణ్‌కు చెందిన ఇల్లు శనివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడి వివరాలు.. లక్ష్మణ్ శనివారం ఉదయం ఇంట్లో ఉండగానే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు అక్కడకు వెళ్లేసరికే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదుతో పాటు బట్టలు, బియ్యం, ఇతర సామగ్రి అంతా కాలిబూడిదైంది. చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తీసుకువచ్చారు.

రికవరీలో మిన్నగా నిలిచాం


రాజశేఖర్‌రాజు, సీఐ

కోరుట్ల: చోరీ సొత్తు రికవరీలో 2022 సంవత్సరంలో మిన్నగా నిలిచామని కోరుట్ల సీఐ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022లో జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో రైతుల కరెంటు మోటార్లు ఎత్తుకెళ్లి ఇబ్బందులు పాలు చేస్తున్న దొంగలను అరెస్టు చేసి 65 మోటార్లు, 3 టన్నుల కాపర్‌వైర్ రికవరీ చేసి రైతులకు అప్పగించామన్నారు. కోరుట్ల పరిసరాల్లో బైక్‌లు చోరీ చేస్తున్న ముఠాను పట్టుకుని 44 బైకులు రికవరీ చేశామని వెల్లడించారు. అధిక వడ్డీలతో వేధిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేసి నియంత్రించినట్లు వివరించారు. కోరుట్ల సర్కిల్ పరిధిలో 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో కలకలం రేపిన రెండు సుపారీ గ్యాంగ్‌లను, జనశక్తి రాజన్నతో సంబంధాలు ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఎస్సైలు సతీశ్, శ్యాంరాజ్, రాంచంద్రం, సుధీర్‌రావు ఉన్నారు.

రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు

ధర్మపురి: రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలున్నాయని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సంఘంలో శనివారం కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డైరెక్టర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, బలిపెల్లి లింగన్న, పెద్ద పోశం సీఈవో అయ్యోరి రాజేశ్ ఉన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే రూ.20వేల జరిమానా

మెట్‌పల్లి(కోరుట్ల): రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే రూ.20వేల జరిమానా విధిస్తామని ఎంపీపీ మారు సాయిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ట్రాక్టర్ యాజమానులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేజ్‌వీల్స్ నడపడంతో రోడ్లు దెబ్బతింటున్నాయని, ఇక నుంచి తనిఖీలు నిర్వహిస్తామని, పట్టుబడితే జరిమానాతో పాటు కేసు నమోదు చేయిస్తామన్నారు. ఆర్డీవో వినోద్‌కుమార్, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి ఉన్నారు.